క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

జైనూర్: ఇటీవల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు యాదవరావు మృతిచెందడంతో బుధవారం మండలంలోని పార గ్రామంలోని బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే కోవ లక్ష్మి పరామర్శించారు. ఆమె మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో యాదవరావు ఎంతో కీలక పాత్ర పోషించారన్నారు. నాయకులు కనక యాదవరావు, ఇంతియాజ్‌లాలా, భగవంత్ రావు, భీంరావు, విశాల్, ఖదీర్ ఉన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన



ఆశ్రమ పాఠశాలలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న సిబ్బంది

వాంకిడి: మండలంలోని వెలిగి గ్రామంలో గల ఆశ్రమ పాఠశాలలో వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులకు ఆరోగ్య విద్య, పరిసరాల శు భ్రత, అంటు వ్యాధులపై అవగాహన కల్పించారు. తరగతి గదులలో దోమల మందు పిచికారీ చేశారు. పాఠశాల ఆవరణలో డ్రైడే నిర్వహించి పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈవో పెందూర్ రవిదాస్, హెచ్‌ఎం మారుతి, ఏఎన్‌ఎం రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానిస్తున్న పిక్లాతండా గ్రామస్తులు

లింగాపూర్: మండలంలోని పిక్లాతండా గ్రామంలో బుధవారం పదోన్నతులు పొందిన పీఎస్ హెచ్‌ఎం బానోత్ రామారావ్, స్కూల్ అసిస్టెంట్ నూనావత్ గంగాసింగ్, తుకారాంలను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. వీరితో పాటు ఐఐటీలో సీటు సాధించిన నితిన్‌తో పాటు నీట్‌లో సీట్ సాధించిన పృథ్వీరాజ్‌లను మాజీ సర్పంచ్ మంగిబాయి కిషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో హరి నాయక్, బాపురావ్, శీను, బానోత్ అంబాజీ, సీతారాం, గంగాబాయి, లలిత, వల్జిబాయి గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తులకు సన్మానం

జైనూర్: ఆషాఢమాసం పురస్కరించుకొని మహారాష్ట్రలోని ఆళంది దేవాచి నుంచి పండరీపూర్‌కు పాదయాత్ర చేసిన మండలానికి చెందిన భక్తులు శేఖర్, శివరాజ్ పాటిల్ సిందేలను బీజేపీ నాయకులు బుధవారం మండలకేంద్రంలో సన్మానించారు.

నేడు హెచ్‌ఎంలకు సమావేశం

కెరమెరి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం మధ్యాహ్నం 1.30 గంటలకు ప్రధానోపాధ్యాయులకు సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈవో ఆడే ప్రకాశ్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, క్యాడర్ స్ట్రెంత్ పూర్తి వివరాలు, యూనిఫామ్‌ల డిక్లరేషన్ ఫామ్, ఖాతా జిరాక్స్ కాపీలు, డ్రాప్‌బాక్స్, ఎండీఎం వివరాలతో సకాలంలో హాజరు కావాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమానికి ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ట్యాబ్‌లతో రావాలని ఆయన తెలిపారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై మధుకర్

కౌటాల: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వారు సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని కౌటాల ఎస్సై ఎన్. మధుకర్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో బుధవారం బాధితుడికి ఫోన్ అప్పగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుంబారి గ్రామానికి చెందిన శంకర్ ఇటీవల తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా ట్రేస్ చేసి బాధితుడికి అప్పగించినట్లు తెలిపారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు..!



దహెగాం మండలంలోని లగ్గాం గ్రామానికి చెందిన మోరె బాపు అనే రైతుకు చెందిన ఎద్దు గత మే నెలలో మేతకు వెళ్లి గ్రామ సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరుకు తగిలి మృతి చెందింది. ఎద్దు విలువ సుమారు రూ.35 వేలు ఉంటుందని, ఎద్దు మృతి చెందడంతో వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడిందని రైతు వాపోతున్నాడు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కంచె ఏర్పాటు చేయక పోవడంతోనే ఎద్దు మృతి చెందింది.



దహెగాం మండలంలోని గెర్రె గ్రామ సమీపంలో చెరువు కట్ట వద్ద ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైరుకు తగిలి పాకాల శంకర్ అనే రైతుకు చెందిన గేదె ఈనెల 8న మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేక మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.



మండల కేంద్రంలో కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్

- కంచెలు ఏర్పాటు చేయని వైనం
- మృతిచెందుతున్న మూగజీవాలు
- పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు

దహెగాం: విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లు మూగ జీవాలకు మృత్యుపాశాలుగా మారుతున్నాయి. గ్రామాల్లో సైతం జన సంచారం ఉన్న ప్రదేశంలో కూడా ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయక పోవడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

కంచెలు కరువు..

గ్రామాల్లో, వ్యవసాయ పొలాల్లో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు పూర్తిస్థాయిలో కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 15 నుంచి 18 వరకు ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. అందులో 5 ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు లేకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ రోడ్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద జనసంచారం ఉంటుంది. మూగ జీవాలు సైతం అక్కడే తిరుగుతుంటాయి. కానీ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. సింగిల్ ఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లు విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసి ఉండడం.. ఎర్త్ వైరు భూమికి అనుకొని ఉండడంతో వాటి వల్ల కూడా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాపోతున్నారు. కాగా వ్యవసాయం కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయడం ఉండదని విద్యుత్ అధికారులు పేర్కొంటున్నారు. వ్యవసాయం కోసం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ల ఎర్త్ వైర్లకు తగిలే పశువులు మృత్యువాత పడుతున్నాయని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కంచె లేని ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధికి నిధులు కేటాయించాలి

- సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు

బెజ్జూర్: వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ వెనుకబడిన జిల్లాలు, నియోజకవర్గాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీఎం, డిప్యూటీ సీఎంలు అన్ని పథకాలను తమ నియోజకవర్గాలకు మళ్లించుకుంటున్నారన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై శాసనసభ కమిటీ వేయాలని అసెంబ్లీలో డిమాండ్ చేస్తామని పేర్కొన్నారు. మండలంలోని పెండింగ్ సమస్యలపై సైతం అసెంబ్లీ వేదికగా గళమెత్తుతామన్నారు. బేషరతుగా రుణమాఫీ చేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం రూ.6800 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దులుపుకోవాలని చూస్తుందని విమర్శించారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేపట్టారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ రంగాయనక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీలు కొండ్ర మనోహర్ గౌడ్, కొప్పుల శంకర్, నాయకులు పాల్వాయి శ్రావణ్ రావు, కొండపీటి భాస్కర్ రాజు, సామల తిరుపతి పాల్గొన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న ఆంజనేయులుగౌడ్

రెబ్బెన: కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా రైతుల రుణాలు మాఫీ చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం గోలేటి పంచాయతీ పరిధి దుర్గాపూర్‌లో రైతులతో కలిసి వానాకాలం పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు రైతులకు రూ. 2లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి రాగానే రుణమాఫీకి షరతులు విధించటం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో రైతులు మడావి జంగు, కుడిమేత పైకు, మడావి దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడపొద్దు

లింగాపూర్: పత్రాలు లేకుండా వాహనాలు నడపొద్దని ఎస్సై ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో ఆయన వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాల్లో మోతాదుకు మించి ప్రయాణికులకు తరలించొద్దన్నారు. మద్యం సేవించి ద్విచక్ర వాహనాలు నడపొద్దని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. అక్రమంగా గుట్కా, గంజాయి, బియ్యం తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పంచాయతీ మారితే పైసలొచ్చేనా..?

- ఆందోళనలో కార్యదర్శులు
- గ్రామ పంచాయతీలకు అందని నిధులు
- సొంత ఖర్చులు వెచ్చించిన వైనం
- నేడు బదిలీలకు కౌన్సెలింగ్



సుర్దాపూర్ గ్రామ పంచాయతీ

కెరమెరి: గడిచిన కొంత కాలంగా బదిలీల కోసం ఎదురు చూసిన పంచాయతీ కార్యదర్శుల కల ఎట్టకేలకు నెరవేరనుంది. నేడు జిల్లా కేంద్రంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. గత ఏడు నెలలుగా పంచాయతీలకు నిధులు విడుదల కాకపోవడంతో అనేక మంది అభివృద్ధి కోసం సొంత డబ్బులు ఖర్చు చేశారు. ఈ నేపథ్యంలో బదిలీపై వెళ్తే ఖర్చు చేసిన డబ్బులు ఇస్తారా? అని ఆందోళనలో ఉన్నారు. జిల్లాలో 335 గ్రామ పంచాయతీల్లో 238 పంచాయతీ కార్యదర్శులున్నారు. వీరిలో 40 శాతం మందిని బదిలీ చేయనున్నారు. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా 96 మంది బదిలీలకు అర్హులు. ఐదేళ్లు పూర్తి చేసిన వారి జాబితాను సేకరించి 96 మందిని అర్హులుగా గుర్తించారు.

ఒకే చోట ఐదేళ్లు ఉన్నవారికి..

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 27 మంది పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహిస్తున్నారు. నాలుగు గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జీలు ఉన్నారు. ఒకే చోట ఐదేళ్ల పనిచేసిన వారిని బదిలీకి అర్హులుగా ప్రభుత్వం గుర్తించింది. దీంతో మండలంలో 12 మంది బదిలీలకు ఆప్షన్లు ఇచ్చారు. వీరిలో బాబేఝరి, భోలాపటార్, మోడి, గోండ్‌గూడ, మెట్టపిప్రి, ఆగర్‌వాడ, కొఠారి, ఝరి, రింగన్‌ఘాట్, కెలిబి, సావర్‌ఖెడా, కెస్లాగూడ గ్రామ పంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.

రూ.లక్ష వరకు..

బదిలీల వ్యవహారాన్ని ఊహించని గ్రామ కార్యదర్శులు కొన్ని నెలలుగా అభివృద్ధి పనులకు సొంతంగా డబ్బులు ఖర్చు చేశారు. పంచాయతీ ట్రాక్టర్, డీజిల్, వీధిలైట్లు, బ్లీచింగ్ పౌడర్, ఉపాధిహామీ పనుల కూలీలకు తాగునీరు, నీటి డబ్బాలు, నెట్ షెడ్లు తదితరాలకు ఖర్చు చేశారు. ఒక్కో కార్యదర్శి రూ. 30 వేల నుంచి రూ.లక్ష వరకు వెచ్చించారు. బిల్లులు విడుదలైనప్పుడు తీసుకుందామనే ఉద్దేశంతో వారు ఖర్చు చేశారు. కానీ ప్రస్తుతం బదిలీల నేపథ్యంలో డబ్బులు తిరిగొస్తాయా అని ఆందోళన చెందుతున్నారు.

ఇబ్బంది లేకుండా చూస్తాం

బదిలీలు జరిగినా పంచాయతీ కార్యదర్శులు గ్రామ పంచాయతీ అభివృద్ధికి ఖర్చు చేసిన డబ్బులు ఇప్పిస్తాం. ఆందోళన అవసరం లేదు. ఇప్పటికే ఎంత ఖర్చు చేశారో అన్ని నివేదికలు 19లోపు సమర్పించాలని ఆదేశించాం.

– ఎండీ అంజద్ పాషా, ఎంపీడీవో

భక్తిశ్రద్ధలతో మొహర్రం



దహెగాంలో పీరీల ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు



జైనూర్‌లో సవారీలను ఊరేగిస్తున్న భక్తులు



పెంచికల్‌పేట్: ఎల్లూర్‌లో..

దహెగాం: మండల కేంద్రంతో పాటు ఒడ్డుగూడ, మొట్లగూడ, రాళ్లగూడ, హత్తిని తదితర గ్రామాల్లో బుధవారం మొహర్రం ఉత్సవాలను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పీరీలను ఊరేగించారు. సాయంత్రం మండల కేంద్రంలో మార్కెట్ ఏరియాలో హైదొస్సు నృత్యాలు చేశారు.

జైనూర్: మతాలకతీతంగా హిందూ, ముస్లింలు ఏకమై నిర్వహించే మొహర్రం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. మలీద నైవేద్యాలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సవారీలను గ్రామంలో ఊరేగించారు. దౌలత్‌రావు, గ్రామస్తుల ఆధ్వర్యంలో పూజలకు హాజరైన భక్తులకు అన్నదానం నిర్వహించారు.

బెజ్జూర్: మొహర్రం పదో దినాన్ని పురస్కరించుకొని బుధవారం గోల్కొండ మసీద్ సొసైటీ సభ్యులు షర్బత్ పంపిణీ చేశారు. ఏటా కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు మసీద్ ఉమర్ కమిటీ అధ్యక్షులు అమీరుద్దీన్ అన్నారు. మజీద్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

లింగాపూర్: మండలంలో బుధవారం కంచన్‌పల్లి, ఏల్లాపటార్, కొత్తపల్లి గ్రామాల్లో డప్పుచప్పుళ్ల మధ్య పీరీలు ఊరేగించారు.

ఆసిఫాబాద్అర్బన్: త్యాగాలకు ప్రతీకగా నిర్వహించే మొహర్రం పండుగ 10వ రోజు ముగింపు వేడుకలు బుధవారం జిల్లా కేంద్రంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మలీద మద్దలు, బెల్లం షర్బత్, ప్రత్యేక వంటకాలను నైవేద్యంగా చూపించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పీరీల బంగ్లాల నుంచి పీరీలతో పట్టణంలోని పలు వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. సీఐ సతీశ్‌కుమార్, ఎస్సై ప్రవీణ్, సిబ్బందితో కలిసి బందోబస్తు ఏర్పాటు చేశారు.

కెరమెరి: మండల కేంద్రంలో బుధవారం మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకొని పీర్ల పండుగను ఘనంగా జరుపుకున్నారు. కెరమెరిలోని ఎస్సీ కాలనీతో పాటు బేల్దార్‌గూడలో వేడుకలు జరుపుకున్నారు. మండల కేంద్రంలో మాజీ వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం, మౌళి హైదర్, సదర్ యూసూఫ్, కెరమెరి మాజీ ఉపసర్పంచ్ నిసార్‌లు ప్రజలకు షర్బత్ పంపిణీ చేశారు.

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి, మొట్లగూడ, కొండపల్లి, ఎల్కపల్లి, ఎల్లూర్ గ్రామాల్లో మొహర్రం పండుగను ఘనంగా జరుపుకున్నారు. డప్పుచప్పుళ్లు, యువకుల నృత్యాలతో పంజా, సవార్ల ఊరేగింపుతో గ్రామాల్లో సందడి నెలకొంది. భక్తులు సవార్లకు కుడుకలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు రుణమాఫీ సంబురాలు

రెబ్బెన: మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం రుణమాఫీ సంబరాలను నిర్వహిస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. రైతుమాఫీ పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి రైతులు వీడియోకాన్ఫరెన్స్ ద్వారా వీక్షించవచ్చని మొదటి విడుతలో లబ్ధిపొందే రైతులకు రుణమాఫీ డబ్బులను ప్రభుత్వం రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తుందని తెలిపారు.

లింగాపూర్: ప్రభుత్వం రుణమాఫీ చేస్తున్న సందర్భంగా గురువారం 4 గంటలకు మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించే ప్రారంభోత్సవ కార్యక్రమానికి రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులు తరలిరావాలని వ్యవసాయాధికారి ఆనంద్ రావ్ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రైతువేదికలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వీక్షించేందుకు వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

కౌటాల: కౌటాల రైతు వేదిక భవనంలో గురువారం సాయంత్రం 4 గంటలకు వీసీ యూనిట్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని మండల వ్యవసాయ అధికారి పాలకుర్తి రాజేశ్ బుధవారం తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నేడు మొదటి విడత రైతుల రుణమాఫీ రూ.లక్ష వరకు మాఫీ ప్రారంభ కార్యక్రమాన్ని వీసీ ద్వారా రైతులకు ప్రసారం చేస్తామని తెలిపారు.

19న వాహనాల వేలం

కాగజ్‌నగర్‌రూరల్: అక్రమ రవాణాలో పట్టుబడిన వాహనాలకు ఈనెల 19న కాగజ్‌నగర్ ఎక్సైజ్ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ రవి తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే వేలంలో ఆసక్తి గల అభ్యర్థులు పాల్గొనాలని సూచించారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

నార్నూర్: మండలంలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన వారి కుటుంబాలను ఎమ్మెల్యే కోవ లక్ష్మి, తాజా మాజీ జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్‌లు పరామర్శించారు. హత్యకు గురైన నాగల్‌కొండ గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు జాదవ్ గజేందర్, ఇటీవల విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన జాదవ్ హేమంత్ కుటుంబసభ్యులను వారు పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకురాలు మార్చుకోలా సరస్వతి, ప్యాక్స్ చైర్మన్ ఆడే సురేశ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జాదవ్ శ్రీరాం నాయక్, ఊర్వేత రూప్‌దేవ్, కనక ప్రభాకర్, సయ్యద్ ఖాసిం ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

జైనథ్: మండలంలోని పిప్పల్‌గావ్ ప్రాథమిక పాఠశాలలో 9ఏళ్లు పనిచేసి, ఇటీవలే బదిలీల్లో భాగంగా వేరే పాఠశాలకు వెళ్లిన ఉపాధ్యాయులు శివన్న, వినోద్ కుమార్‌లను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ మేరకు బుధవారం పాఠశాలలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు.

నాటుసారా తరలిస్తున్న ఇద్దరు అరెస్టు



స్వాధీనం చేసుకున్న నాటు సారాతో సిబ్బంది

రెబ్బెన: మండలంలోని కై రిగూడ నుంచి ద్విచక్ర వాహనాలపై ఇద్దరు వ్యక్తులు నాటుసారా తరలిస్తూ పట్టుబడినట్లు ఎక్సైజ్ ఎస్సై రమేశ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గ్రామాల్లో నాటుసారా రవాణా చేస్తున్నారనే సమాచారం మేరకు బుధవారం వాహనాలను తనిఖీ చేయగా రెండు ద్విచక్రవాహనాలపై 20 లీటర్ల నాటుసారా రవాణా చేస్తూ కై రిగూడ గ్రామానికి చెందిన లావుడ్య రాంకుమార్, అజ్మీర సీతారాంలు పట్టుబడ్డారు. వారిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, సిబ్బంది సురేశ్, ధను పాల్గొన్నారు.

ధ్యాన కేంద్రం వద్ద వన మహోత్సవం



మొక్కలు నాటుతున్న అభ్యాసకులు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి టౌన్‌షిప్‌లో గల శ్రీ రామచంద్ర మిషన్ యోగాశ్రమం (హార్ట్ ఫుల్‌నెస్ ధ్యాన్య కేంద్రం) వద్ద బుధవారం తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని అభ్యాసకులు మొక్కలు నాటారు. ముందుగా సామూహిక ధ్యానం చేసిన అనంతరం ధ్యాన కేంద్రం పరిసరాల్లో రకరకాల పండ్లు, పూలమొక్కలు నాటారు. కార్యక్రమంలో అభ్యాసకులు శ్రీనివాస్‌రావు, గుండేటి వీరస్వామి, రాంబాబు, ఓరం కిరణ్, గోపాలక్రిష్ణ, విలాస్ తదితరులు పాల్గొన్నారు.

బోరు బాగు చేయరూ..!



లింగాపూర్: మండల కేంద్రంలో ప్రధాన రహదారి పక్కన ఉన్న బోర్‌వెల్ చెడిపోగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. సమీపంలోని దాదాపు 30 కుటుంబాలు ఈ బోర్‌పైనే ఆధారపడి ఉన్నాయి. బోర్ పనిచేయకపోవడంతో తాగునీరు లేక, మిషన్ భగీరథ నీరు సరిగా రాక ఇబ్బందులు తప్పడం లేదని వారు వాపోతున్నారు. మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి బోర్‌కు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

ఆలయాల్లో ఏకాదశి పూజలు



ఎల్కపల్లిలో పూజల్లో పాల్గొన్న భక్తులు

పెంచికల్‌పేట్: తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. మూల విరాట్‌లకు పంచామృత అభిషేకం, అష్టోత్తర తులసీదళార్చన, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.